క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

చిలుకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ సోమవారం తెలిపారు. 30 కిలోల బ్యాగ్ సబ్సిడీ పోను రూ. 843 లు చెల్లించి తీసుకోవాలన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జీరాక్స్ దరఖాస్తు ఫారానికి జత చేసి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోసుకోవాలని సూచించారు. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, టీచర్, మహిళలు

చిలుకూరు : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా చిలుకూరు అంగన్‌వాడీ కేంద్రం – 4 లో సోమవారం సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల త్రివేణినగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్యస్వాముల దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.


దాతల సహకారం అభినందనీయం



క్రీడా వస్తువులను ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి సలీం షరీఫ్

నడిగూడెం : పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి ఎండీ. సలీం షరీఫ్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వాసికర్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు రెండున్నర లక్షల రూపాయల వ్యయంతో సోమవారం క్రీడా వస్తువులు, కంప్యూటర్ డెస్కులు, ప్రింటర్‌లను బహూకరించి అనంతరం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ కుటుంబసభ్యులు దాతలు విహారి, నీలిమా ప్రసాద్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కన్నెగంటి సుజాత, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాంబాబు, సీఆర్‌పీ గోవర్దన్, మొక్క భిక్షపతి, చలపతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి స్వాతి నక్షత్ర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలోని శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతి నక్షత్ర కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణను వేదమంత్రోచ్చరణాలతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో పార్వతీరామలింగేశ్వర స్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



గరిడేపల్లిలో కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



పని ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ప్రతిరోజూ 5 వేల మందికి పనులు
- కొనసాగుతున్న పంట కాలువల పూడికతీత
- పర్యవేక్షిస్తున్న అధికారులు

గరిడేపల్లి : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలలో 16 వేల 768 కుటుంబాలు ఉండగా అన్ని కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో 39017 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు.

ఆయకట్టు కావడంతో..

గరిడేపల్లి మండలం పూర్తిగా నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతం కావడంతో పంట పొలాల నుంచి చెరువులకు వెళ్లే కాలువ ఫీడర్ చానల్ పనులు మాత్రమే సాగుతున్నాయి. మండలంలో ఇప్పటివరకు 1674 పనులు పూర్తి అయ్యాయి. ఈ పనులకు గాను లక్ష 16 వేల 232 పని దినాలు కల్పించారు. 2023– 24 సంవత్సరానికి గాను ఈ పని దినాలు ఇప్పటివరకు రెండు కోట్ల 27 లక్షల రూపాయల వరకు వేతనాలను కూలీలకు చెల్లించారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ మండల వ్యాప్తంగా ప్రతీరోజు 4800 నుంచి 5000 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పనులకు హాజరైన కూలీలకు వేతనాలను వెంటనే చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రతి కూలీకి పనిని బట్టి కొలతల ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారు. పంట కాలువ పూడికతీత పనులు, పంట కాలువ నుంచి చెరువులకు వెళ్లే కాలువ పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎండ తీవ్రతతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో మండలంలో ఉపాధి హామీ పథకం ఆధికారులు పనులను పర్యవేక్షించడంలో నిమగ్నం అవుతున్నారు.

1674 పనులు పూర్తి



మండలంలోని 32 గ్రామ పంచాయితీలలో 1674 పనులు పూర్తయ్యాయి. 2023– 24 సంవత్సరానికి గాను ఇప్పటివరకు లక్ష 16 వేల 232 పని దీనాలు కల్పించి 2 కోట్ల 27 లక్షల రూపాయల వరకు వేతనాలు చెల్లించారు. ఫీల్డ్ చానల్, ఫీడర్ చానల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వేతనాలు కూడా వెంటనే చెల్లిస్తున్నారు. కూలీలకు పనులు కల్పించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

– వనజ, ఎంపీడీఓ, గరిడేపల్లి

దైవానుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి



గరిడేపల్లి : విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గరిడేపల్లి :పిల్లుట్ల రఘును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

గరిడేపల్లి : దైవానుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాలువపల్లి గ్రామంలో శ్రీశీతల పరమేశ్వరి (బొడ్రాయి), శ్రీ సీతారామచంద్రలక్ష్మణ ఆంజనేయస్వామి శిఖర కీర్తి ధ్వజ గణపతి, షిరిడీసాయినాథ, దత్తాత్రేయ, శ్రీరాధాకృష్ణ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయకష్టం చేసుకొని, నీతి, నిజాయితీగా జీవించే ప్రజలకు దేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. ముందుగా పూజారులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాజశేఖరశర్మ, భద్రయ్యశర్మ, మోహన్‌శర్మ, ఉపేందర్‌శర్మలు పూర్ణకుంభంతో ఎంపీకి స్వాగతం పలికారు. అదేవిధంగా ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లుట్ల రఘును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టుకొండ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ బి.సందీప్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బచ్చలకూరి కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలపై గంగమ్మ దీవెనలు ఉండాలి

నేరేడుచర్ల : గంగమ్మ దేవత దీవెనలు ప్రజలపై ఉండాలని నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెంచికల్ దిన్నలో నిర్వహించిన గంగమ్మ జాతరకు ఆయన హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, పాలకీడు ఎంపీపీ గోపాల్‌నాయక్, నాయకులు కృష్ణయ్య, శ్రీను, నాగరాజు, వెంకటయ్య, సైదులు, రామకృష్ణ, లింగయ్య, హరిబాబు, ప్రకాశ్, సురేష్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అజయ్, పాండునాయక్, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కేసుల రాజీతో స్నేహపూర్వక వాతావరణం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జీలు జిట్టా శ్యాంకుమార్, మారుతి ప్రసాద్

హుజూర్‌నగర్ : పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు హాల్‌లో గల తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, బ్యాంకు కేసులు, కుటుంబ వివాద కేసులు, ప్రిలిటిగేషన్ కేసులతో పాటు చెక్ బౌన్స్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఒకరు గెలిచి మరొకరు ఓడిపోయినట్లుగా కాకుండా సామరస్యం, స్నేహపూర్వక వాతావరణం ఉంటుందని అన్నారు. కేసుల రాజీతో ఇరుపక్షాల మధ్య శత్రుత్వ వైఖరి తొలిగిపోయి సత్సంబంధాలు మెరుగుపడతాయని అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సుమారుగా 8 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. లోక్ అదాలత్‌లో రాజీ పడడానికి అర్హత కలిగిన కేసులు చాలా ఉన్నాయని కక్షిదారులు పరస్పర అంగీకారంతో కేసులను రాజీ చేసుకుంటే కోర్టులో కేసుల పెండింగ్ భారం తగ్గుముఖం పడుతుందని ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి కక్షిదారులు రాజీపడే విధంగా చైతన్యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ పీఆర్‌ఓ కాల్వ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడ : విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



హుజూర్‌నగర్ : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

కోదాడ : తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్‌ను అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కోదాడలో జరిగిన విద్యుత్ విజయోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ రంగానికి విద్యుత్ కోతలు లేవని అన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. దీని కోసం ప్రభుత్వం ఏటా 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా విద్యుత్ సబ్ స్టేషన్‌లను, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త విద్యుత్ ప్లాంట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, విద్యుత్ శాఖ అధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ : ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నదని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని కొండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు పరిశ్రమలు, వ్యవసాయ రంగం, గృహ వినియోగానికి విద్యుత్ సరఫరా మొక్కుబడిగా జరిగేదని అన్నారు. ప్రభుత్వం నేడు నిరంతరం 24 గంటలు విద్యుత్ అందిస్తుందని చెప్పారు. తెలంగాణ సాధించుకున్నాక తలసరి విద్యుత్ వినియోగం 70 శాతం పెరిగి దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత నియోజకవర్గంలో రూ. 473 కోట్ల నిధులతో విద్యుత్ సరఫరా, సబ్ స్టేషన్లు, కొత్త లైన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 20 వేల కొత్త కరెంట్ పోల్స్, 330, 440 కేవీ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసి వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహ వినియోగానికి నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో 48 వేల ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ బోర్లకు ఆటో స్టాటర్లను తొలగించాలని రైతులను విజ్ఞప్తి చేశారు. అన్ని మండలాల్లో, మున్సిపాలిటీల్లోనూ కాలంతో పోటీపడి పని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూ 3,500 కోట్లతో అభివృద్ధి చేశామని త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు.అభివృద్ధిలో భాగస్వాములై అంకితభావంతో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దశాబ్ది ఉత్సవాల ఇన్‌చార్జ్, డీపీఓ యాదయ్య, పీడీ పద్మ, విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య, ఏడీఈ సక్రూనాయక్, ఏఈలు పి.శ్రీనివాస్, బి.రాంప్రసాద్, ఆర్.నగేష్, నర్సింహా.నాయక్, హరీష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జయబాబు, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, సుజాత, పార్వతి, జెడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, చంద్రకళ, జగన్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను తగులబెట్టొద్దు : ఎమ్మెల్యే



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నలో ఊర చెరువు అలుగు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : పంట పొలాల్లో వరి కొయ్యలను తగులబెట్టొద్దని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం క్షేత్ర స్థాయి పర్యటనను ముగించుకొని హుజూర్‌నగర్‌కు వస్తున్న క్రమంలో పట్టణ శివారులో ఒక రైతు తన పొలంలో మంటలను ఆర్పుతుండటాన్ని చూసి కారు దిగి ఆ రైతుతో మాట్లాడారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వరి కొయ్యలను నిప్పు పెట్టి పోయాడని దీంతో గడ్డి వాము తగలబడుతుందని నీళ్లు పోసి మంటలను ఆర్పుతున్నానని రైతు ఎమ్మెల్యేకు చెప్పాడు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ దయచేసి ఎవరు పొలంలోని వరికొయ్యలను తగులబెట్టవద్దని చెప్పారు. దానివలన భూమిలోని మంచి బ్యాక్టీరియా చనిపోతుందని, రైజోబియం లాంటి నైట్రేట్ వనరులు కాలిపోతాయని, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. అంతేకాకుండా గాలిలో క్లోరో కార్బన్ మోనాక్సైడ్లు పెరిగి శ్వాసకోశ వ్యాధులు సంభవిస్తాయని చెప్పారు. వాటిని తగుల బెట్టకుండా దుక్కిలో కలియ దున్నితే భూమిలో మురిగి పంటకు బలం చేకూరుతుందని ఆయన తెలిపారు.

చెరువు అలుగు బ్రిడ్జి పనుల పరిశీలన

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో గల ఊర చెరువు అలుగు బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తైతే పెంచికల్‌దిన్న, బురుగులతండా గ్రామ ప్రజలకు ఎంతో సౌకర్యకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఎల్లబోయిన లింగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీని వాస్, శ్రీకాంత్, నాయకులు నాగరాజు, గురువయ్య, బాలునాయక్, నాగార్జున, ఎలిషా తదితరులు ఉన్నారు.

ప్రజల కోసం పోరాడిన వ్యక్తి వెంకటరెడ్డి



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : అన్ని వర్గాల ప్రజల బాగు కోసం పోరాడిన వ్యక్తి సీపీఎం నాయకుడు పులిచింతల వెంకటరెడ్డి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వెంకటరెడ్డి సంతాప సభలో వారు పాల్గొని మాట్లాడారు. సమాజహితం కోసం పనిచేసిన వారు చిరస్మరణీయులని పేర్కొన్నారు. అలాగే ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, పారేపల్లి శేఖర్‌రావు, దీరావత్ వినాయక్, కొలిశెట్టి యాదగిరిరావు, మేదరమట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు యరగాని నాగన్న, నిజాముద్దీన్, దొంగరి వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పాలకూరి బాబు, మామిడి వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ నాయకులు మేకల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు అట్లూరి హరిబాబు, గొట్టె వెంకటరామయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు పరిధిలోని జువారి సిమెంట్స్ పరిశ్రమలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



జానలదిన్నలో మొక్కలు నాటుతున్న పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వైకుంఠపురం గ్రామ కార్యదర్శి అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వైకుంఠాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జానలదిన్నలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, సైదులు, పవన్ ఉన్నారు.

దేవాలయ స్థలం.. వివాదాస్పదం



చిలుకూరులో వివాదంలో ఉన్న దేవాలయ స్థలం

చిలుకూరు : పాత చిలుకూరులోని అంకమ్మ గుడి వద్ద గల దేవాలయ స్థలం గత కొన్ని రోజులుగా వివాదాస్పదమవుతోంది. అంకమ్మ గుడి వద్ద గల స్థలంలో గ్రామ దేవతల ఆలయాలు నిర్మించాలని ఆలయ కమిటీ సభ్యులతో పాటు, పలువురు గ్రామస్తులు అంటున్నారు. కానీ ఆ స్థలాన్ని గతంలో తాము కొనుగోలు చేశామని ఎప్పటినుంచో తమ ఆధీనంలోనే ఉందని గడ్డివాములు, పెంటదిబ్బలు కూడా వేసుకున్నామని ఆక్రమణదారులు చెబుతున్నారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదనలు జరుగుతున్నాయి. అయితే గ్రామంలో ఈ నెల 12వ తేదీన బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ ఉన్నందున వాటితో పాటు ఈ గ్రామ దేవతల ఆలయం నిర్మించి ప్రారంభించాలని గ్రామంలోని మెజారిటీ సభ్యులు అంటున్నారు. కానీ స్థలం ఆక్రమించిన వారు ఖాళీ చేయకపోవడంతో సమస్య జఠిలం అవుతోంది. నిబంధనల ప్రకారం దేవాలయం వద్ద హద్దులు నిర్ణయించి తమకు స్థలాన్ని అప్పగించాలని ఆలయ కమిటీ సభ్యులు.. ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్‌ఐలకు చెప్పినా పట్టించుకోలేదని విమర్శలు వినబడుతున్నాయి. స్థలం విషయంలో ఘర్షణలు జరగకముందే అధికారులు దేవాలయాల నిర్మాణాలకు స్థలాన్ని తమకు అప్పగించాలని గ్రామస్తులు, కమిటీ సభ్యులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు



నడిగూడెం : సిరిపురంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ సలీం షరీఫ్, ఉపాధ్యాయులు

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్ కోరారు. సోమవారం మండల పరిధిలోని సిరిపురంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయని తెలిపారు. బాడిబాటలో భాగంగా సిరిపురం, రత్నవరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, సుజాత, సీఆర్‌పీ గోవర్ధన్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. సోమవారం మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్ట మాధవి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, కోటిరెడ్డి తదితరులున్నారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గోదాము నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్ చైర్మన్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే గోదాము నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డిలతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ ఊరే రాధాకృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు నిధులతో గోదాము నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుందూరు శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు నాగరాజు, జోజిరెడ్డి, వెంకటరెడ్డి, రవి, సీతారావిఎరెడ్డి, మల్లారెడ్డి, వీరమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు శంకర్, కె.వెంకటరెడ్డి, కార్యదర్శి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో సోమవారం యాదవులు నిర్వహించిన గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా యాదవులు బేర్ల దరువులతో నృత్యాలు చేసుకుంటూ గంగమ్మ ఆలయం వద్దకు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గరిడేపల్లి వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు గంధం యల్లయ్యయాదవ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ వట్టె యల్లయ్యయాదవ్, రైతు సంఘం అధ్యక్షుడు పోతురాజు చంద్రయ్య, గ్రామ ప్రధాన కార్యదర్శి బచ్చలకూరి శ్రీను, సైదయ్య, పందిరి నాగయ్య, వట్టె వెంకటేశ్వర్లుయాదవ్, సైదులుయాదవ్, యల్లరాజుయాదవ్, యాదవ పెద్దలు పాల్గొన్నారు.

ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని, కౌలు భూములలో ఇటుక బట్టీలు నిర్వహిస్తుండటంతో వ్యవసాయ భూముల భూసారం దెబ్బతింటోందని, కౌలు వేలం పెంచి భూమిలేని పేదలకు వేలంలో అవకాశం కల్పించాలని రాష్ట్ర దేవాదయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు జంగాల సంఘం నాయకుడు పస్తం రాఘవులు సోమవారం ఫిర్యాదు చేశారు. అదేవిధంగా బూరుగడ్డ దేవాలయ భూములు విస్తీర్ణం, కౌలు వివరములు, కౌలు తీసుకున్న రైతుల వివరాలు, తదితర వివరాలను తెలపాలని జిల్లా వినియోగదారుల సంఘం సమన్వయ కమిటీ డివిజన్ కార్యదర్శి పందిరి యల్లారెడ్డి సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు.

వెంకటేశ్వరశర్మ మృతి బాధాకరం



వెంకటేశ్వరశర్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీసమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు, అర్చక సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు కొంకపాక వెంకటేశ్వరశర్మ మృతి బాధాకరమని ఎంపీ, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం వెంకటేశ్వరశర్మ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరశర్మ 1994 నుంచి తనకు అత్యంత సన్నిహితుడని తెలిపారు. శివాలయం అభివృద్ధి, ఉత్సవాల విషయంలో కలిసి నిర్ణయం తీసుకునేవాళ్లం అని తెలిపారు. శర్మ.. దాన, ధర్మాలు, సేవలతో పలువురిని ఆదుకున్నారన్నారు. మంచి మిత్రుడిని కోల్పోయానని అన్నారు. తన కుటుంబసభ్యులకు అండగా ఉంటామన్నారు.

వెంకటేశ్వరశర్మకు పలువురి నివాళి

కొంకపాక వెంకటేశ్వరశర్మ మృతదేహం వద్ద సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, శానంపూడి సైదిరెడ్డి, కృషి ఫౌండేషన్ చైర్మన్ నర్సిరెడ్డి, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు, ఎంపీపీ పద్మ సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు.